క్లుప్తంగా

అణ్వస్త్ర రహిత సమాజంతో శాంతి సాధ్యం



సంస్మరణ సభల షెడ్యూల్ విడుదల చేస్తున్న ప్రకాశరావు తదితరులు

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్రాల రహిత సమాజంతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబు దాడులను పురస్కరించుకుని సంస్మరణ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావుతో కలిసి ఈ సంస్మరణ సభల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రపంచ శాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ 6న వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగే సంస్మరణ సభకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆనందమార్గ్ ఆశ్రమానికి వితరణ



పిల్లలకు అందించిన నిత్యావసర సరకులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లల కోసం పాత డెయిరీ ఫారం వద్ద రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్ నిర్వాహకులు గురువారం నిత్యావసర సరకులు అందజేశారు. సుమారు రూ.15 వేలు విలువ చేసే 50 కిలోల బియ్యం, పప్పులు, ఆయిల్ ప్యాకెట్లు, సబ్బులు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులు ఇక్కడ ఆశ్రమం కమిటీ నిర్వాహకులు, పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవదూత, కమిటీ సభ్యుడు పాత్రో దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పదవీ విరమణ ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం



రాజును సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగి, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.పి.ఎం.రాజు పదవీ విరమణ సందర్భంగా గురువారం యూనియన్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజుకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు గజమాల వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో రోడ్ల నిర్మాణానికి వినతి

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో పాడైన రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ కార్యదర్శి వి.కృష్ణారావు కోరారు. ఈ మేరకు జోన్–3 కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. వార్డులో మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, చైతన్యనగర్ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని ఆయన కోరారు. భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టాలన్నారు. మురుగునీరు ప్రవాహంతో కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. పైపులైన్లు లీకవుతున్నాయని చెప్పారు. వీధుల్లో రోడ్లు తవ్వి ఎక్కడికక్కడ వదిలేశారని, స్థానికులు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయని, ఇప్పటికైనా సిమెంట్ రోడ్ల పనులు చేపట్టాలని ఆయన కోరారు.

శిథిల స్థితిలో ముడసర్లోవ పార్కు



పార్కులో పెరిగిన గడ్డి



పార్కులో తుప్పు పట్టిన ఆట పరికరాలు

ఆరిలోవ: పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చే ముడసర్లోవ పార్కు ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. కార్తీక మాసంలో నగరవాసులకు పిక్నిక్‌లు జరుపుకోవడానికి ముందుగా ఈ పార్కే గుర్తుకు వస్తుంది. ఈ పార్కును బ్రిటిష్ అధికారుల కాలంలో నిర్మించారు. అప్పట్లో విశాఖపట్నం వచ్చిన బ్రిటిష్ అధికారులు విశ్రాంతి తీసుకోవడానికి, విడిది చేయడానికి గెస్ట్ హౌస్ కూడా నిర్మించారు. ఇప్పుడు ఆ గెస్ట్ హౌస్ శిథిలమైంది. ఎప్పుడు కూలుపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉంది. బ్రిటిష్ కాలం అనంతరం సందర్శకుల సౌకర్యం కోసం జీవీఎంసీ కూడా ఇక్కడ కొన్ని సౌకర్యాలు కల్పించింది. 1990లో సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ కూడా ప్రస్తుతం మూలకు చేరింది. దీంట్లో ఏపుగా గడ్డి పెరిగిపోయింది. అటువైపుగా సందర్శకులు వెళ్లినా స్విమ్మింగ్ పూల్ ఉన్నట్లు ఆనవాలు కూడా కనిపించడం లేదు. దీన్ని ఆనుకొని మొసళ్ల కొలను ఉండేది. ఇప్పుడు ఇది పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీని పక్కనే వాటర్ ఫౌంటైన్ ఉండేది. ఇది కూడా శిథిలమై అస్తవ్యస్తంగా మారిపోయింది. ప్రస్తుతం ఈ పార్కులో గడ్డి ఏపుగా పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. పార్కు లోపల పిల్లల కోసం జీవీఎంసీ గతంలో ఏర్పాటు చేసిన ఆట పరికరాల తుప్పు పట్టిపోతున్నాయి. వాటర్ పంప్ హౌస్ సైతం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందోన్న భయంతో ఇక్కడ సిబ్బంది గడుపుతున్నారు.

చుట్టూ కొండలు, ఓ పక్క నీటితో నిండిన రిజర్వాయరుతో పర్యాటకులను ఆహ్లాదాన్ని అందించే ఈ పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలమైన నీటి పంప్ హౌస్



శిథిలమైన విశ్రాంతి షెల్టర్లు



పిచ్చ గడ్డితో నిండిన ఒకప్పటి మొసళ్ల కొలను

గిరి ప్రదక్షిణలో సేవలకు ప్రశంసలు



దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎంవీ రావు

ఆరిలోవ: సింహగిరి ప్రదక్షిణలో భక్తులకు 30 సంవత్సరాలుగా సేవలు అందించినందుకు దేవస్థానం అధికారులు గుర్తించి ప్రశంసించారని విశ్వాస్ సంస్థ ప్రతినిధి ఎంవీ రావు తెలిపారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరుగుతున్న గిరి ప్రదక్షిణలో భక్తులకు నిరవధికంగా సేవలందించిన పలు స్వచ్ఛంద సంస్థలను గుర్తించి గురువారం దేవస్థానం అధికారులు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఆరిలోవ కేంద్రంగా ఉన్న విశ్వాస్ సంస్థ కూడా గిరి ప్రదక్షిణ భక్తులకు ముడసర్లోవ వద్ద 30 సంవత్సరాలుగా పలు రకాల ప్రసాదాలు, మందులు, తాగునీరు, మజ్జిగ ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలా మందికి పంపిణీ చేస్తుంది. ఈ సేవలకు గుర్తింపుగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రశంసా పత్రం అందించారని రావు తెలిపారు.

కంటి శుక్లాలపై అశ్రద్ధ తగదు

ఆరిలోవ: కంటిపై ఏర్పడే శుక్లాలను అశ్రద్ధ చేయకూడదని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శిల్పా తరణి తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో గురువారం కంటి వ్యాధితో బాధపడుతున్న వారికి ఆమె అవగాహన కల్పించారు. కంటి శుక్లాలను అశ్రద్ధ చేయడం వల్ల అంధత్వం వస్తుందన్నారు. జన్యుపరమైన, జీవ క్రియ లోపాలు, ఇన్‌ఫెక్షన్, గాయం వల్ల కంటి శుక్లాలకు గురవుతుంటారన్నారు. కంటిలో తెల్ల మచ్చ కనిపించడం, మెల్ల కన్ను, కనుబొమ్మలు వనకడం వంటివి కంటి శుక్లాల లక్షణాలని తెలిపారు. కంటికి ఎలాంటి సమస్య వచ్చినా వైద్యులు పర్యవేక్షణ లేకుండా మందులు వాడకూడదన్నారు. మధుమేహం, గ్లకోమా, మూత్ర పిండాల వ్యాధి, కంటి గాయాలు, కంటి లోపల మంట తదితర వాటి ప్రభావం వల్ల కంటిలో శుక్లాలు ఏర్పడడానికి అవకాశం ఉందన్నారు. స్టరాయిడ్స్ వాడటం, ధూమపానం, పొగాకు నమలడం వల్ల కూడా కంటి శుక్లాలు రావడానికి అవకాశం ఉందన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారు శస్త్ర చికిత్స చేసుకోవడం మంచిదన్నారు.

సమస్యలే తిలక్ సాహిత్య ఇతివృత్తాలు



తిలక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తెలుగు శాఖాధిపతి ఆచార్య అప్పారావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు

బీచ్ రోడ్డు: సామాజిక సమస్యలపై దేవరకొండ బాలగంగాధర్ తిలక్ తన సాహిత్యంలో ప్రస్తావించారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో దేవరకొండ బాలగంగాధర్ తిలక్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జె.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా తిలక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా నరసింహారావు మాట్లాడుతూ తిలక్ సమాజ మార్పు కోసం పేదరికం, భూస్వామ్యం, నియంతృత్వ పోకడలు ఇలాంటి సమస్యలను తన సాహిత్యంలో ప్రస్తావించారన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా డి.ప్రవీణ మాట్లాడుతూ తిలక్‌కు చిన్ననాటి నుంచి సాహిత్య అభిలాష ఎక్కువని, తన కథలు, కవిత్వంలో ప్రతీ అంశాన్ని తిలక్ స్పృశించారని కొనియాడారు. ఆత్మీయ అతిథి జి.యోహానుబాబు మాట్లాడుతూ తిలక్ కవిత్వంలో తన సైనికుడు ఉత్తరం చాలా ఇష్టమని అప్పటి సైనికుల జీవితాన్ని అది ప్రతిబింబించిందని వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకురాలు నేమాని శారదా మాట్లాడుతూ తిలక్ రచనా విలువలు గుర్తుంచుకోవడం చాలా అవసరమన్నారు. బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డి.వి.సూర్యరావు మాట్లాడుతూ తిలక్ కథలో తాత్వికతను ఆవిష్కరించారన్నారు. తెలుగు విభాగం సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ప్రతికవి విమర్శకుడే, ప్రతి విమర్శకుడు కవి కావచ్చు, కాకపోవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్ డాక్టర్ సీతారత్నం డాక్టర్ గిరీష్ కుమార్, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

సీతంపేట: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టుల అర్బన్ యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 మధ్య జర్నలిస్టులకు టిడ్కో ఇళ్లు కేటాయించడానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించిదన్నారు. ఆతర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. నేటికీ జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం కాలేదన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను రాష్ట్ర కార్యవర్గంతో కలుసుకుని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించమని కోరతామన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం




జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

ఎంవీపీ కాలనీ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎంఎస్ఎఫ్ నాయకులు గురువారం ఏయూలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ జెండాను చూపుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ చదువుల ఆశాకిరణ్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలోని ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంస్థలు 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించిందన్నారు. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం చిరస్మరణీయమన్నారు. ఈ 30 ఏళ్లలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్ఫూర్తిదాయక ఉద్యమాలు చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ ఎస్.మురళి, ఎ.రాజు, మెత్తళ్ల చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పై జీవీఎల్ హర్షం

ఎంవీపీ కాలనీ: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై బీజేపీ నాయకుడు జీవీఎల్ నరసింహారావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ఫలాలు వెనుబడిన వర్గాల వారందరికీ సమానంగా అందాలనే ఆకాంక్షను ఈ తీర్పు నెరవేర్చనుందన్నారు.

అప్పన్న దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం విశాలాక్షినగర్‌కు చెందిన ఎస్.నాగేశ్వరరావు రూ.లక్ష 116 రూపాయల విరాళాన్ని, చందన సమర్పణకు మరో రూ.లక్ష 116ల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు.

తల్లిపాల శ్రేష్టతపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెంలోని వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలు పట్టించాలన్నారు. తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమన్నారు. వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, రవిశంకర్, బేగం, నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్, నర్సింగ్ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట : కేజీహెచ్ పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ హాజరై మాట్లాడారు. త్వరలోనే కేజీహెచ్‌లో తల్లిపాల కేంద్రం ప్రారంభం కానుందన్నారు. అలాగే తల్లులకు తల్లిపాల గదులు కూడా ఏర్పాటవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కృష్ణవేణి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ సామిని, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి తదితరులు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు.

అధినేతతో ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు





జగన్‌తో పల్లా దుర్గారావు, మొల్లి అప్పారావు

ఆరిలోవ/బీచ్ రోడ్డు/మద్దిలపాలెం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు, నాయకులు గురువారం కలిశారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులతో తాడేపల్లిలో నిర్వహించిన సమావేశం అనంతరం వారు అధినేతను కలుసుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, మువ్వల లక్ష్మి, ఉమ్మడి స్వాతి, పార్టీ నాయకులు, ఉమ్మడి దాస్, పల్లా దుర్గారావు, మువ్వల సురేష్‌ తదితరులు ఉన్నారు.

ఆరిలోవలో కోడ్ వర్తించదా?



ఆరిలోవ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద టీడీపీ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు

ఆరిలోవ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆరిలోవ ప్రాంతానికి వర్తించినట్లు లేదు. ఎక్కడికక్కడే టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు రోడ్ల పక్కన ఉన్నాయి. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, హనుమంతవాక, విజయదుర్గాకాలనీ, పదో వార్డు పాత డెయిరీఫారం కూడలి జాతీయ రహదారి పక్కన, రవీంద్రనగర్, 11వ వార్డు పరిధి బాలాజీనగర్, టీఐసీ పాయింట్, 12వ వార్డు తోటగరువు, పెదగదిలి, 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద టీడీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేమ చూపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గత నెల 30 నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు గడిచినా ఇంత వరకు ఆయా ప్రాంతాలలో స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించలేదు. ఇది ఎన్నికల నియమ, నిబంధనలను వ్యతిరేకించడమేనని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ అధికారులు మాత్రం ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి, అధికార టీడీపీ నాయకుల ఫ్లెక్సీల జోలుకు వెళ్లకపోవడాన్ని తప్పుపడుతున్నారు. తక్షణం ఎన్నికల నిబంధనల మేరకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఔషధ మొక్కల పెంపకం ఆరోగ్యానికి మేలు



కృష్ణా కళాశాల ప్రాంగణంలో ఔషధ మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీవన వైవిధ్య వనం పెంచుదామని, ఇందుకు విద్యార్థుల సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచాలన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ విత్తనాల నిధిని ఏర్పాటు చేయడానికి గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. మొక్కలు పెంచడం ద్వారా పక్షులు గూళ్లు పెట్టుకుని వాటి మనుగడ సాధిస్తాయన్నారు. ఆకు కూరల పెంపకాన్ని ఇంటి పెరట్లో చేపడడం ద్వారా తాజా ఆర్గానిక్ ఆకుకూరలు తినేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనమాలి సంస్థ ప్రతినిధులు మళ్ల సరిత, ఎ.అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు చంద్రమౌళి, పి.స్వామినాయుడు, వి.పద్మజ, పుష్పలత, సుజాత, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి పాలు పిల్లలకు వరం



రెయింబో ఆస్పత్రిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిల్లల వైద్యులు

ఆరిలోవ: తల్లి పాలు పిల్లలకు వరమని రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ దినోత్సవం సందర్భంగా హెల్త్ సిటీ రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రిలో గురువారం చంటి పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ సీహెచ్.రాగసుధ, డాక్టర్ ఎం.వి.ఆర్.శైలజ, డాక్టర్ నిహారిక మాట్లాడుతూ పిల్లలు పుట్టిన ఆరు మాసాల వరకు తల్లి పాలు విధిగా పట్టాలని సూచించారు. తల్లి పాలు తాగిన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆస్పత్రిలో ఈ నెల 7వ తేదీ వరకు బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రాంతీయ డైరెక్టర్ రావి శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నలిని, డాక్టర్ దిలీప్, మనోజ్ రెడ్డి, సత్యసాగర్ పాల్గొన్నారు.

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం



తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో శతాబ్దం నుంచి నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమాత ఏ విధంగా లోకానికి తల్లిగా మారిందో విశదీకరించారు. ముందుగా శిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, దయాస్, రాసా వీధుల్లో తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు వినయ్‌కుమార్, ఆంథోనీ రాజ్, ఆంధ్రా క్యాథలిక్ యూనియన్ ప్రెసిడెంట్ బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.